## అదనపు కలెక్టర్‌గా తిరుపతిరావు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపడుతున్న అదనపు కలెక్టర్ తిరుపతిరావు

వనపర్తి, జూలై 19 : అదనపు కలెక్టర్ రెవెన్యూ బాధ్యతలను ఎస్.తిరుపతి రావు బుధవారం కలెక్టరేట్‌లో ఆయన చాంబర్‌లో స్వీకరించారు. రంగారెడ్డి జిల్లాలో అదనపు కలెక్టర్‌గా రెండున్నర ఏండ్లుగా విధులు నిర్వహించి తిరుపతిరావును వనపర్తి జిల్లాకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర తేజస్ నందలాల్ పవార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, పాలన యంత్రాంగానికి అవసరమైన సేవలను అందిస్తానని అదనపు కలెక్టర్ తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్‌ను జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

## దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు, జూలై 19: ఆత్మకూరు డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బుధవారం ప్రకటనలో తెలిపారు. కళాశాలలో తెలుగు, కంప్యూటర్ సైన్స్ (అప్లికేషన్), జంతుశాస్త్రం, గణితం, వాణిజ్య శాస్త్రం సబ్జక్టుల్లో బోధించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పీజీలో 55శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50శాతం మార్కులు కలిగిన వారు అర్హులుగా పేర్కొన్నారు. పీహెచ్‌డీ పూర్తయిన వారికి ప్రాధాన్యత ఉంటుందని, నెట్, సెట్ అర్హతలు ఉన్న వారికి తదుపరి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. బోధన అనుభవాన్ని, అదనపు అర్హతలు లేనప్పుడు పీజీలో వచ్చిన మార్కుల శాతాన్ని పరిగణలోకి తీసుకోబడునని పేర్కొన్నారు. 2023-24 సంవత్సరానికి మాత్రమే ఈ నియామకాలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఇంటర్వ్యూ, డెమో ద్వారా ఎంపిక చేస్తారని ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 21 సాయంత్రం 3:30గంటల లోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని ప్రిన్సిపాల్ సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 22న ఉదయం 10 గంటలకు వనపర్తి డిగ్రీ కళాశాలలో జరిగే డెమో , ఇంటర్వ్యూలకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

## పెబ్బేరు మండలంలో..

పెబ్బేరు, జూలై 19 : పెబ్బేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్స్‌పాల్ ప్రదీప్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, చరిత్ర సబ్జెక్టులను బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 21 వరకు దరఖాస్తులు అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

## రేషన్ డీలర్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

చిన్నంబావి, జూలై 19 : మండలంలోని అయ్యవారిపల్లిలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ పోస్ట్‌కు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తాసీల్దార్ ఘాన్సీరాం తెలిపారు. ఎస్సీ కేటగిరికి చెందిన పురుషుడికి రేషన్ షాపును కేటాయించనుని, పదో తరగతి ఉత్తీర్ణత తోపాటు గ్రామానికి చెందిన వారై ఉండాలని చెప్పారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పుట్టినతేది, విద్యార్హతలు, కులం, పూర్తి చిరునామా, స్థానికతకు సంబంధించిన సర్టిఫికెట్లు జిరాక్స్ సెట్‌ను దరఖాస్తుతోపాటు అందజేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 18నుంచి 50 ఏండ్ల వయసు కలిగి ఉండాలన్నారు. ఈనెల 31వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

## డ్రేనేజీ నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలి

- మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్

వనపర్తి, జూలై 19 : పట్టణంలో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. బుధవారం పట్టణంలోని కర్నూల్‌రోడ్డులో రోడ్ల విస్తరణలో చేపడుతున్న పనుల్లో భాగంగా నూతన డ్రైనేజీ నిర్మాణానికి ఆయన వార్డు కౌన్సిలర్ లక్ష్మీదేవమ్మ, నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏఈ భాస్కర్, నాయకులు శివ, వినోద్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, గోపాల్ యాదవ్, కోళ్ల వెంకటేశ్, షఫీ తదితరులు పాల్గొన్నారు.


నాయకులతో కలిసి డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్

# రైతుల మేలుకోరే బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే మద్దతు

- అజ్జకొల్లు రైతు సమావేశంలో రైతుల ఏకగ్రీవ తీర్మానం

మదనాపురం, జూలై 19 : వ్యవసాయానికి 24గంటలు కరెంట్ ఇచ్చి రైతులను ఆదుకుంటున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే మా మద్దతు ఉంటుందని రైతులు ముక్తకంఠంతో పలికారు. మండలంలోని అజ్జకొల్లు రైతువేదిక భవనంలో బుధవారం రైతుబంధు సమితి మండల కో-ఆర్డినేటర్ హనుమాన్‌రావు అధ్యక్షతన రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ కృష్ణయ్య, దేవరకద్ర నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జయంతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటనారాయణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు యాదగిరి, మాజీ అధ్యక్షుడు రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొమ్మిదేండ్ల కేసీఆర్ పాలనలో రైతుల సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులపై విషం కక్కుతూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతులకు 24గంటల నాణ్యమైన ఉచిత కరెంట్ ఇస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలో, కేవలం 3గంటలు కరెంట్ ఇస్తామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం కావాలో రైతులు ఆలోచించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశం అనంతరం రైతులందరూ బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే తమ మద్దతు ఉంటుందని ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచులు బ్రహ్మమ్మ, రాంనారాయణ, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మాసన్న, కోఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, ఎంపీటీసీ సంఘం మండల అధ్యక్షుడు కురుమయ్య, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కురుమూర్తి, మాజీ ఎంపీపీ మహదేవన్ గౌడ్, మాజీ ఎంపీటీసీ నాగన్నయాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మన్న, రాములుగౌడ్, తిరుపతయ్య, వాసురెడ్డి, కరుణాకర్‌రెడ్డి, చిన్నరాములు, రాఘవులు, కొండన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ హనుమాన్‌రావు

# జోరుగా ముసురు వాన

**వర్షపాతం వివరాలు మి.మీ.లో**

| మండలం | వర్షపాతం |
|---|---|
| వనపర్తి | 13.8 |
| అమరచింత | 5.2 |
| మదనాపురం | 7.5 |
| పెద్దమందడి | 11.8 |
| ఖిల్లా ఘణపురం | 14.8 |
| గోపాల్‌పేట | 13.2 |
| రేవల్లి | 13.6 |
| పాన్‌గల్ | 9.6 |
| కొత్తకోట | 9.7 |
| ఆత్మకూర్ | 5.2 |
| పెబ్బేర్ | 13.6 |
| శ్రీరంగాపురం | 9.0 |
| వీపనగండ్ల | 10.2 |
| చిన్నంబావి | 10.8 |

వనపర్తి, జూలై 19 : జిల్లా వ్యాప్తంగా రెండురోజులుగా ముసురు వాన పడుతున్నది. జిల్లాలో అక్కడక్కడ రహదారులపై వర్షం నీరు నిలిచిపోయింది. ముసురు వర్షాలు కురువడంతో జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లా వ్యాప్తంగా యావరేజ్‌గా వర్షపాతం 10.6 మి.మీశాతంగా నమోదైంది. వర్షపాతం ఖిల్లా ఘణపురం మండలంలో గరిష్ఠంగా 14.8మి.మీ, కనిష్టంగా 5.2మిల్లి మీటర్లుగా అమరచింత, ఆత్మకూరు మండలాల్లో నమోదైంది.




జిల్లా కేంద్రంలో ముసురు వర్షంలో గొడుగు సాయంతో వెళ్తున్న మహిళలు

### సాగులో నిమగ్నమైన రైతన్నలు

ఖిల్లాఘణపురం, జూలై 19 : మండల కేంద్రం తోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో రెండురోజులుగా ఎడతెరపి లేకుండా ముసురు వర్షాలు కురుస్తున్నాయి. మండలంలో 14.8వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు సాగులో నిమగ్నమయ్యారు. ఆయా గ్రామాల్లో బోరుబావులు, చెరువుల కింద ఉన్న పొలాల్లో ముందస్తుగా నారు వేసుకొని వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులు ముసురు వర్షాలకు నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు.

# జిల్లా స్థాయి కథల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొత్తకోట,జూలై 19 : కొత్తకోట పట్టణానికి చెందిన పీపుల్స్ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి కథల పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు ఆ సంస్థ చైర్మన్ రాజావర్ధన్‌రెడ్డి తెలిపారు. టీటీడీ వారి ఆధ్వర్యంలో విద్యార్థుల్లో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు రామాయణం,భారతం, భాగవతం, పంచతంత్ర కథలో నీతి కథలను తీసుకొని 'కథను చెబుతారా- ఉ కొడుతారా' అనే కార్యక్రమాన్ని నిర్వహించింది. జూనియర్స్ విభాగంలో 5వ తరగతికి చెందిన మేఘనకు మొదటి బహుమతి, 4వ తరగతికి చెందిన రఘునందన్‌కు రెండో బహుమతి, 4వ తరగతికి చెందిన చైత్రకు మూడో బహుమతి లభించినట్లు తెలిపారు. సీనియర్స్ విభాగంలో 9వ తరగతికి చెందిన అశ్వినికి మొదటి బహుమతి, 9వ తరగతికి చెందిన దేవికకు రెండో బహుమతి, పదోతరగతికి చెందిన విద్యకు మూడో బహుమతి అందజేశారు. వీరికి బహుమతులతోపాటు రూ. 1000, రూ. 750, రూ.500 నగదును టీటీడీ వారు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు కృష్ణవేణి , చంద్ర హాస్‌రెడ్డి పాల్గొన్నారు.


కథల పోటీల్లో ప్రతిభను చాటిన విద్యార్థులు

# స్థలాలను రెగ్యులరైజేషన్ చేసేందుకే పరిశీలన

అమరచింత, జూలై 19 : ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ముందు ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లు కట్టుకున్న పేదలకు వారి పేరుపై స్థలాలను రెగ్యులరైజేషన్ చేసేందుకే 58, 59 జీవో దరఖాస్తులను వివిధశాఖల అధికారులు పరిశీలిస్తున్నారని తాసీల్దార్ షేక్ చాంద్‌పాషా పేర్కొన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలోని నందిమల్ల గ్రామానికి చెందిన ఒకరు, మండల కేంద్రానికి చెందిన వారు ఒకరు 58,59 జీవో ఆధారంగా తాము 2014కు ముందే ప్రభుత్వ స్థలంలో ఇండ్లను నిర్మించుకున్నామని, ఇంటి, కరెంట్ బిల్లుల తోపాటు ఆధార్ జిరాక్స్‌లతో దరఖాస్తుల చేసుకున్నారన్నారు. ఆ ఇండ్లను ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లి కార్జున్, ఆర్‌ఐ గోపాల్, మండల సర్వేయర్ పాండులతో కలిసి పరిశీలించినట్లు తాసీల్దార్ తెలిపారు.


అమరచింత కొత్త ఎస్సీ కాలనీలో 58,59 దరఖాస్తులను పరిశీలిస్తున్న తాసీల్దార్ షేక్‌చాంద్‌పాషా

## పాముకాటుకు గురైన విద్యార్థి పరిస్థితి మెరుగు

కొత్తకోట, జూలై 19: వీపనగండ్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పాముకాటుకు గురైన పదో తరగతి విద్యార్థి ఆనంద్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ప్రిన్సిపాల్ దయాకర్ తెలిపారు. ఆ విద్యార్థి శనివారం అర్ధరాత్రి పాముకాటుకు గురికాగా తెల్లవారుజామున వరకు పాఠశాలలో ఎవరికీ చెప్పకుండా ఉన్నాడు. పరిస్థితి విషమించడంతో ఉపాధ్యాయులకు చెప్పగా వెంటనే జిల్లా దవాఖానకు తరలించి చికిత్సలు అందించారు.

విషయం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి విద్యార్థిని నిమ్స్ దవాఖానకు తరలించాలని సూచించడంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స నిర్వహించడంతో మహేందర్ పరిస్థితి మెరుగైనట్లు ఆయన తెలిపారు. విద్యార్థిని గురువారం డిశ్చార్జ్ చేయనున్నట్లు వైద్యులు తెలిపినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

## క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్ల పంపిణీ


బాధితులకు పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ భవాని

మదనాపురం, జూలై 19 : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన క్షయ వ్యాధిగ్రస్తులు 15మందికి మండల కేంద్రానికి చెందిన దాత భానుప్రకాశ్‌గుప్తా సహకారంతో బుధవారం పీహెచ్‌సీలో పోషకాహార కిట్లను డాక్టర్ భవాని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం క్షీణించినవారికి పోషకాహార కిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సూపర్ వైజర్ ప్రమీల, ఏఎన్‌ఎం నర్మద, పీహెచ్‌సీ సిబ్బంది సురేశ్‌కుమార్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.